క్లుప్తంగా

ఘనంగా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ జయంతి


కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు, విద్యార్థులు

అచ్యుతాపురం రూరల్ : డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త రాజాన సన్యాసినాయుడు మాట్లాడుతూ ముఖర్జీ భారతీయ జనసంఘ్‌ను స్థాపించి భారతీయుల్లో ఐక్యతను పెంచేందుకు కృషి చేశారన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంతిన భక్తసాయిరామ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు కూండ్రపు నాయుడుబాబు, కర్రి వెంకటస్వామినాయుడు, ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం


గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తుడు

మునగపాక: మండలంలోని పాటిపల్లి-మంగళవరపుపేట గ్రామాల పరిధిలోని గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.పలువురు భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యులవుతున్నారు. ఆదివారం పాటిపల్లికి చెందిన ఆడారి అప్పారావు కుమారుడు ఎ.వి.ఎస్. మూర్తి,శారద దంపతులు రూ.11,116 నగదును విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు


భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న మిత్ర వాకర్స్‌క్లబ్ సభ్యులు

మునగపాక: ఏకాగ్రతతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని మిత్ర వాకర్స్ క్లబ్ ప్రతినిధి సూరిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇటీవల జరిగిన పదవతరగతి పరీక్షల్లో 578 మార్కులు సాధించి, నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు పొందిన టెక్కలి భాగ్యలక్ష్మిని ఆదివారం ఉదయం మిత్ర వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇష్టపడి,కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మల్ల జోగారావు, కె.వి.ఎస్. అప్పారావు,వెలగా శ్రీనివాసరావు, వి.డి.ఎం. నాయుడు,పాలిమేర కృష్ణ, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజూ కొనసాగిన సప్తాహం


మునగపాక సాయిబాబా ఆలయంలో సప్తాహం చేస్తున్న భక్తులు

మునగపాక: స్థానిక షిరిడీసాయి బాబా ఆలయంలో నిర్వహిస్తున్న సప్తాహం ఆదివారం మూడోరోజు కొనసాగింది. పలు గ్రామాలకు చెందిన భజన బృందాల సభ్యులు సాయి గీతాలను ఆలపించారు. ఉదయం నుంచి భక్తులు సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు. ఈ నెల 10న ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర తెలిపారు.

స్పందన చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

ఎస్.రాయవరం: లింగరాజుపాలెంలో ప్రభుత్వ పాఠశాలలో 1నుంచి 8 వ తరగతి వరకు చదివే 40 మంది విద్యార్థులను ఎంపిక చేసి, పాఠశాల సమయం అయ్యాక ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఆదివారం తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్పందన చేయూత ఫౌండేషన్ సభ్యుడు దండు గణపతిరాజు మాట్లాడుతూ సంస్థ ద్వారా అనకాపల్లి, నర్సీపట్నం ప్రాంతాల్లో సుమారు 6 వందల మంది విద్యార్థులకు 25 సెంటర్ల ద్వారా ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఈపూరి సీతారామరాజు,కార్యదర్శి ఆనంద్ ,సభ్యులు దండు గోపాల్‌కృష్ణరాజు,సాంబమూర్తిరాజు,నారాయణమూర్తిరాజు,బి.వి.ఆర్‌రాజు,కలిదిండి సుబ్బరాజు, నాథ్,లత,రేఖ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లున్నా బీళ్లుగా..

చెంతనే రిజర్వాయర్ ఉంది... వర్షాలకు పుష్కలంగా నీరు చేరుతుంది. అయినా దాని కింద ఆయకట్టులో సగానికి పైగా భూములకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. దీంతో చీడిక రిజర్వాయర్ ఆయకట్టుదారులు వర్షాధారంపై పంటలు పండించుకోవలసిన దుస్థితి ఏర్పడింది.


చీడిక రిజర్వాయర్

- అధ్వానంగా చీడిక రిజర్వాయర్
- తుప్పుపట్టిన షట్టర్లు, గ్రిల్స్
- చెట్లు, పిచ్చిమొక్కలు, పూడికతో నిండిన కాలువలు
- మెరక గ్రామాల్లో మెట్ట భూములకు సాగునీరందని దుస్థితి
- అవస్థలు పడుతున్న అన్నదాతలు


కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు


తుప్పు పట్టిన షట్టర్లు

నక్కపల్లి: మండలంలోని మెరక గ్రామాల్లో మెట్ట భూములకు సాగునీరు అందించే చీడికరిజర్వాయర్ అధ్వానంగా తయారైంది.రిజర్వాయర్ గర్భంలో చెట్లు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. కాలువల్లో పూడిక పేరుకుపోయింది. దీంతో వందలాది ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. మెరక గ్రామాల్లో సాగునీటి అవసరాల కోసం చీడికలో 40 ఏళ్లక్రితం రిజర్వాయర్ నిర్మించారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ రిజర్వాయర్ కింద చీడిక, దోసలపాడు, జగన్నాథపురం,రమణయ్యపేట,గుల్లిపాడు,ముకుంద రాజుపేట,డొంకాడ,కొత్తూరు గ్రామాలకు చెందిన సుమారు 800 ఎకరాల ఆయకట్టు ఉంది. వరితో పాటు మామిడి, జీడి, ఉద్యాన వన పంటలు, కూరగాయలు పండిస్తారు. మెరక గ్రామాల్లో మెట్ట భూములకు చీడిక రిజర్వాయర్ వరప్రదాయినిగా నిలిచేది. ఈ రిజర్వాయర్‌కు అనుబంధంగా నిర్మించిన కాలువల ద్వారా దిగువ ప్రాంతాల్లో ఉన్న పలు చెరువుల్లోకి సైతం నీరు చేరేది. అటువంటి రిజర్వాయర్ కొన్నేళ్లుగా నిరాదరణకు గురైంది. దీంతో ప్రతిఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఫలితంగా రైతులు వర్షాలపైనే ఆధారపడి సాగుచేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. సాగునీరు లేక చాలా భూములు బీళ్లుగా మారుతున్నాయి. వర్షాలు పడినప్పుడు రిజర్వాయర్‌లోకి భారీగానే నీరు చేరుతున్నా పొలాలకు అందని పరిస్థితి ఉంది.

ఎన్నికలతో సరి..

కూటమిప్రభుత్వంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. చీడిక రిజర్వాయర్‌కు కూడా ఎన్నికలు నిర్వహించి చైర్మన్, డైరెక్టర్లను నియమించినప్పటికీ పూడిక తీత, షట్టర్ల మరమ్మతుల కోసం ఒక్కపైసా కూడా విడుదల చేయలేదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పూడిక తీత పనులు సైతం చేపట్టడం లేదు. రిజర్వాయర్ ఆయకట్టు భూములకు విద్యుత్ సరఫరా కూడా ఉండదు. కొండ ప్రాంతంలో ఉన్న రిజర్వాయర్ ఆయకట్టు భూముల్లో ఎక్కువగా మామిడి, జీడి, బొప్పాయి, అరటి, పంటలతో పాటు, కూరగాయలు పండిస్తారు. సుమారు 400 ఎకరాల్లో ఈ పంటలు సాగవుతాయి. ఇక్కడ రైతులు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని బోర్లు నిర్మించుకుని పంటలు పండించాల్సి వస్తోంది.అయితే చాలా చోట్ల ఈ సోలార్ పవర్‌కూడా సరిగా పనిచేయడం లేదని, రిజర్వాయర్‌కు మరమ్మతులు చేసి కాలువల్లోపూడిక పనులు చేపడితే చివర ఆయకట్టుకు నీరు అంది, పంటలు బాగా పండుతాయని రైతులు చెబుతున్నారు. దాదాపు 30 ఏళ్లనుంచి ఈ రిజర్వాయర్ గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఏడాదైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి చీడిక రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టడంతోపాటు,కాలువల్లో పూడిక తీతపనులు ప్రారంభించి షట్టర్ల ద్వారా నీరు వృథాగా పోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పాడైన షట్టర్లు, గ్రిల్స్

ఈ రిజర్వాయర్ నుంచి దిగువ ప్రాంతాలకు నీరు విడుదల చేసేందుకు షట్టర్లు ఏర్పాటు చేశారు. అవి పూర్తిగా పాడైపోయాయి. తలుపులు పగిలిపోవడం, ఇనుప గ్రిల్స్ తుప్పు పట్టడంతో నీరు వృథాగాపోతోంది. కాలువల్లో ఎక్కడికక్కడ పెద్ద పెద్ద చెట్లు,పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. సుమారు 5 కిలోమీటర్ల మేర కాలువల్లో మట్టి మేటలు వేసి దిబ్బలుగా మారిపోయాయి. రిజర్వాయర్ గర్భంలోకూడా పెద్ద పెద్ద వృక్షాలు మొలిచాయి. కాలువల్లో పూడిక తీత చేపట్టాలంటే రూ.లక్షల్లో ఖర్చవుతుంది. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఏమి చేయలేని దుస్థితిలో ఉండిపోయారు.

పూడిక తీత పనులు చేపట్టాలి



చీడిక రిజర్వాయర్‌కింద మెరక గ్రామాల్లో సుమారు 800 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రిజర్వాయర్‌ను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. పూడిక తీత పనులు చేపట్టటం లేదు. 40 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన షట్టర్లు పూర్తిగా తుప్పుపట్టి పాడైపోయాయి. వర్షాలు పడకపోతే మెరకగ్రామాల్లో భూములు బీడు వారుతున్నాయి. చెంతనే రిజర్వాయర్ ఉండి నీరు అందుబాటులో ఉన్నప్పటికీ వినియోగించుకోలేని దుస్థితి ఏర్పడింది.అధికారులు స్పందించి ఈ ఏడాదైనా పూడిక తీత పనులతో పాటు షట్టర్లకు మరమ్మతులు చేపట్టాలి.

–కరణం ఈశ్వరరావు,
రైతు జగన్నాథపురం

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం


కంబాల జోగులు

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గవిస్తృత స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. అడ్డురోడ్డులో శ్రీనివాస ఫంక్షన్ హాల్లో జరిగే ఈ సమావేశానికి శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు,ఉత్తరాంధ్ర రీజినల్ సమన్వయకర్త, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్టీమహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి,పార్టీ జిల్లా పరిశీలకురాలు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీపేరుతో త్వరలో నియోజకవర్గంలో నిర్వహించే కార్యక్రమంపై చర్చించడంతోపాటు, పార్టీ సంస్థాగతం విషయాలపై చర్చించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి పార్టీలో నాలుగు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ మండల అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు హాజరు కావాలన్నారు, మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు.

ఘనంగా జగన్నాథుని ఉత్సవం

- మునగపాక,నాగులాపల్లి గ్రామాల్లో గూనలతో ఊరేగింపు
- ఆఖరిరోజున బుద్ధావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథుడు


మునగపాకలో నీటితో నింపిన గూన(పెద్ద కుండ)ను తీసుకువెళుతున్న భక్తుడు


జై గంటలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు


అరటి గెలలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు


బుద్ధావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

మునగపాక: మండలంలోని మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో ఆదివారం జగన్నాథస్వామి పండగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు రెండు గ్రామాల్లోని జగన్నాథస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆఖరి రోజున ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. భక్తులు ఉదయం నుంచి ఉపవాసం ఉండి గూన(పెద్దకుండ)లు, జై గంటలతో భారీ ఊరేగింపుగా సంతబయిలులో నూతి వద్దకు చేరుకున్నారు. పలువురు భక్తులు అరటి గెలలతో ఊరేగింపులో పాల్గొన్నారు. అక్కడ స్నానమాచరించి, అనంతరం నీటితో నింపిన గూనలను నెత్తిన పెట్టుకొని ఇళ్లకు చేరుకున్నారు. గూనల్లో ప్రసాదం తయారు చేసి సుభద్ర,బలభద్ర సమేత జగన్నాథునికి నైవేద్యంగా పెట్టి, అందరికీ పంచిపెట్టారు. ఈ ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాలు జై జగన్నాథ నామస్మరణతో మార్మోగాయి. అఖరిరోజున జగన్నాథుడు బుద్ధావతారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం

అచ్యుతాపురం రూరల్ : మత్స్యకార గ్రామమైన పూడిమడకలో జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం పూడిమడక వీధుల్లో బాజా భజంత్రీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఘనంగా ఊరేగింపు జరిపారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ స్వామిని దర్శించుకున్నారు. పూడిమడకతో పాటు మండలంలో పలు గ్రామాల ప్రజలు స్వామి రథాన్ని లాగారు.


పూడిమడకలో నిర్వహిస్తున్న జగన్నాథ స్వామి రథయాత్ర

భక్తిశ్రద్ధలతో మొహర్రం


బోదిగల్లంలో గుమ్మటాలను ఊరేగిస్తున్న ముస్లింలు

నక్కపల్లి/ఎస్.రాయవరం: రెండు మండాలాల్లోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ఆదివారం మొహర్రం నిర్వహించారు. నక్కపల్లి మండలంలో పెద్దదొడ్డిగళ్లు, పెద్దబోదిగల్లం, అప్పలపాయకరావుపేట, రామకృష్ణాపురం, ఎస్.రాయవరం మండలంలో సీతారాముపురం,వెల్లాపురంలలో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గుమ్మటాలను గ్రామాల్లో ఊరేగించారు.

ఎర్రయ్య కుటుంబానికి అండగా ఉంటాం


ఎర్రయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మత్స్యకార నాయకులు

అచ్యుతాపురం రూరల్ : సముద్రంలో గల్లంతైన పూడిమడక మత్స్యకారుడు చోడపల్లి ఎర్రయ్య కుటుంబానికి అండగా ఉంటామని మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నడకుడి అర్జున్ అన్నారు. ఆదివారం ఎర్రయ్య కుటుంబాన్ని సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ ఎర్రయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార నాయకులతో పాటు పూడిమడక, తంతడి గ్రామాల మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

గోకివాడ మాజీ సర్పంచ్ మృతి


అప్పారావు (ఫైల్)

అచ్యుతాపురం రూరల్ : గోకివాడ మాజీ సర్పంచ్ ద్వారపురెడ్డి అప్పారావు (86) అనారోగ్యం కారణంగా ఆదివారం మృతి చెందారు. అప్పారావు వరుసగా 27 సంవత్సరాలు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లా ఉత్తమ రైతు అవార్డు అందుకున్నట్టు చెప్పారు. ఆయన అంతిమయాత్రలో యలమంచిలి మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్యదొర, అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లిలో సోమవారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు వారు చెప్పారు.

విద్యుత్ సరఫరా బంద్ రేపు

పాయకరావుపేట: మండలంలోని కుమారపురం, రాజగోపాలపురం, రత్నయ్యమ్మపేట, రాజవరం, కేశవరం, గజపతినగరం గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

పాయకరావుపేట : మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమర యోధుడు, డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్‌కు పలువురు ఘనంగా నివాళలర్పించారు. బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంపల చినరాజు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆరుగుల రమేష్, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సలికే గోవిందరావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి మహేష్, సలికే అచ్చిరాజు, కాపారపు సత్తిబాబు, మసురపు నూకరాజు, తుమ్మలపల్లి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు


యలమంచిలి బస్టాండ్ పక్కనున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


కొత్తపేట పురాతన సీతారామాలయంలో లక్ష తులసి పూజ చేస్తున్న భక్తులు


పెనుగొల్లులో ఏకాహం నిర్వహిస్తున్న భక్తులు


పాండురంగ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


పూజలందుకున్న కొమ్మాయిగుండం చెరువు పక్కనున్న వేంకటేశ్వరస్వామి

యలమంచిలి రూరల్: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం యలమంచిలి పట్టణం,మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైష్ణవాలయాలకు వేకువజాము నుంచే భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు.యలమంచిలి పట్టణం కొమ్మాయిగుండం చెరువు పక్కనున్న వేంకటేశ్వరస్వామి,ధర్మవరం వేంకటేశ్వర ఉమామహేశ్వర భావనాఋషి స్వామి,రామచంద్రమ్మ కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఇళ్ల ముంగిట కళ్లాపు చల్లి అందమైన ముగ్గులు వేశారు.ఇంట్లో పూజాకార్యక్రమాలు ముగించుకుని దేవాలయాలకు వెళ్లి టెంకాయలు,అరటి పండ్లు,కర్పూరం సమర్పించారు.

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో గల వైష్ణవ దేవాలయాల్లో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పాండురంగ దేవస్థానం, రాజుగారిబీడులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, మంగవరం, పాల్తేరు గ్రామాల్లోని వేంకటేశ్వర ఆలయాల్లో , పలు గ్రామాల్లోని రామాలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు.

ఎస్.రాయవరం: తొలిఏకాదశ పర్వదినాన్ని పురస్కరించుకుని పెనుగొల్లు సీతారామాలయంలో ఏకాహం నిర్వహించినట్టు ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక భజన మండలి భక్తులు వేకువ జామునుంచి ఆలయంలో కీర్తనలు ఆలపించారు. ఎస్.రాయవరంలో వైభవ వేంకటేశ్వస్వామి,కొరుప్రోలులో సీతారామస్వామి, దార్లపూడిలో కల్యాణ వేంకటేశ్వరస్వామి, వమ్మవరంలో స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆయా గ్రామాల భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

జాగ్రత్తలు పాటిస్తే జూనోసిస్ వ్యాధులు దూరం


యలమంచిలి ఏరియా ఆస్పత్రిలో పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న ఏడీ చల్లా గంగాధర్


జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు

యలమంచిలి రూరల్: జంతువులు,పశుపక్ష్యాదుల నుంచి సంక్రమించే జూనోటిక్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏడీ గంగాధర్ ప్రజలకు సూచించారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారినపకుండా ఉండవచ్చని చెప్పారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పక్కనున్న ప్రాంతీయ పశువుల ఆస్పత్రిలో ఆదివారం పశువైద్యులు 250కి పైగా కుక్కలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా రేబీస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ బి.జె.ఎస్. ప్రసాదరాజు ప్రారంభించారు. అనంతరం ఏడీ గంగాధర్ మాట్లాడుతూ జంతువులు, పక్షుల ద్వారా ప్రమాదకరమైన రేబీస్,బ్రూసెల్లోసిస్,ఆంత్రాక్స్(దొమ్మవ్యాధి),స్వైన్‌ఫ్లూ,బర్డ్ ఫ్లూ,జపనీస్ ఎన్సెఫలైటిస్,సిస్టిసర్కోసిస్ తదితర వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. క్రమం తప్పకుండా పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని సూచించారు.పరిసరాల శుభ్రత,బాగా ఉడికించిన మాంసం, గ్రుడ్లు తీసుకోవడం,బాగా కాచిన పాలు తాగడం లాంటి మరికొన్ని జాగ్రత్తలు తీసుకుంటే జూనోటిక్ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. ఉచితంగా రేబిస్ టీకాలు వేయడంతో ఆస్పత్రి ప్రాంగణంపెంపుడు కుక్కలతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఏరియా పశువుల ఆస్పత్రి పరిధిలో ఉన్న పలువురు పశువైద్యులు,సహాయకులు,సిబ్బంది పాల్గొన్నారు.


పాములవాకలో వ్యాక్సిన్ వేస్తున్న డాక్టరు హరిప్రియ

78 కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్

కోటవురట్ల: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. స్థానిక పశు వైద్యాధికారి డాక్టరు ఆర్.ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో 78 కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ వారం రోజుల పాటు పెంపుడు కుక్కలకు ఉచితంగా వ్యాక్సిన్ వేస్తామని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎల్ఎస్ఏ జి.శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు. పాములవాక పశు వైద్య శాలలో డాక్టరు హరిప్రియ పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు, వేచలపు భాస్కర నాయుడు తదితరులు పాల్గొన్నారు.